కుత్బుల్లాపూర్‌లో కుండపోత

- భారీ వర్షంతో ఇబ్బందులు పడిన ప్రజలు
- కొన్ని ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రోడ్లపై భారీగా నిలిచిన వరద నీరు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం



సూరారంలో వడగండ్ల దృశ్యం | జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో శనివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వానతో రోడ్లు వరద నీటితో పోటెత్తాయి. దీంతో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నిజాంపేట్‌లోని జర్నలిస్ట్‌కాలనీ, బండారి లేఅవుట్, బాచుపల్లిలోని ఆదిత్య గార్డెన్స్, చింతల్, గణేశ్‌నగర్, కాకతీయనగర్, కొంపల్లి, సుచిత్ర, దూలపల్లి, జీడిమెట్ల, షాపూర్‌నగర్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరదనీరు చేరింది. గాజులరామారం, నిజాంపేట్, హెచ్‌ఎంటీ తదితర ప్రాంతాల్లో వడగండ్లతో కూడిన వర్షం పడింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

పేట్‌బషీరాబాద్, అయోధ్యనగర్, సూరారం, సూరారం కాలనీ, బ్యాంక్ కాలనీ, జీడిమెట్ల గ్రామం, సుచిత్ర, పాపిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మోకాళ్ల లోతు నీళ్ల మధ్య వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కొన్నిచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

విరిగిన చెట్ల కొమ్మలు..

ఈదురు గాలుల కారణంగా పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఓ ఆటోలో పడిన వడగండ్లు..



బాచుపల్లి ఆదిత్య గార్డెన్స్ రోడ్డులో..



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో..

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు

జీడిమెట్ల: ఉచిత మెడికల్ క్యాంపులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జీడిమెట్లలోని కొపల్లి ఫార్మా అగ్నిప్రమాద ఘటన సమయంలో ఘాటైన వాసనకు మోడీ అపార్ట్‌మెంట్ వాసులు అనారోగ్యం పాలయ్యారు. విషయం తెలుసుకున్న సురేష్‌రెడ్డి మల్లారెడ్డి ఆస్పత్రి చైర్మన్ బద్రారెడ్డితో చర్చించి మంత్రి మల్లారెడ్డి సహకారంతో మోడీ అపార్ట్‌మెంట్‌లో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. క్యాంపులో పాల్గొన్న డాక్టర్లు అపార్ట్‌మెంట్ వాసులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. ఇతర పరీక్షలు అవసరమున్న వారు మల్లారెడ్డి ఆస్పత్రికి వస్తే ఉచితంగా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో లింగారావు, భాస్కర్‌రెడ్డి, ఉషాకళ్యాణి పాల్గొన్నారు.

మార్కండేయ నగర్‌లో..

సుభాష్‌నగర్: ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శనివారం మార్కండేయ నగర్‌లోని సాధన స్కూల్ ఆవరణలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉచిత మెడికల్ క్యాంపుల్లో పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి, మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ



మందులు పంపిణీ చేస్తున్న సురేష్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

25 నుంచి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

దుండిగల్: మేడ్చల్ జిల్లాలో ఈ నెల 25 నుంచి నెల రోజుల పాటు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నద్ధమైంది. ఈ సమ్మేళనాలపై శనివారం గండిమైసమ్మలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జ్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, వివేకానంద్, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మొదటి సమ్మేళనం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తుండగా, కార్పొరేషన్, మున్సిపాలిటీలు, డివిజన్లు, మండలాలు, వార్డుల వారీగా సమ్మేళనాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.

చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

సుభాష్‌నగర్: ఈ నెల 27, 28 తేదీల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు ఆవిష్కరించారు. 27, 28 తేదీల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్సీ వర్గీకరణపై నిరసన తెలియజేయనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మాదిగ, ఉపకులాల వారు పెద్ద ఎత్తున ఢిల్లీ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిలివేరు శ్రీనివాస్, సిద్దయ్య, రాసమల్ల యాదగిరి, ఇందురం తిరుపతి, మట్ట నర్సింలు, బౌరంపేట మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సంజీవరావు తదితరులు

వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్ కాలనీలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగిన తర్వాత మొదటి శనివారం కావడంతో ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పాండుగౌడ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మున్నా, బాలాజీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, ప్రకృతి రాము, జిల్లా గోపాల్, చక్రి, రమేష్ తదితరులు హాజరయ్యారు.

స్మార్ట్ స్కూల్ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: గాజులరామారం పగిడి ప్రతాప్‌రెడ్డి గార్డెన్స్‌లో స్మార్ట్ స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్కూల్ చైర్మన్ నాగేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, ఉపధ్యాయులు స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి యాత్ర చేపట్టిన ఆయన కేఎంజీ కాకతీయనగర్, ఎస్వీఎస్ ఆభరణ కాలనీలలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. రూ.1 కోటి నిధులతో పూర్తి చేసిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, రూ.27 లక్షలతో పూర్తయిన భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీ రోడ్డు వేయాలని కోరగా రూ.57 లక్షల నిధులు మంజూరు చేసి వెంటనే పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండుముదిరాజ్, ఆగం రాజు, దివాకర్, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

- ఖేలో ఇండియా స్కీమ్‌లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దుండిగల్ ఎంఎల్‌ఆర్‌ఐటీ వద్ద 18, 19వ తేదీల్లో 'ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్' నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డితో కలిసి శనివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కో ఆర్డినేటర్ సౌత్ జోన్ డా.మాక్స్‌వెల్ ట్రెవర్, అడిషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కె.పాషా, కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, దుండిగల్ రైడర్స్ భీమ్‌సింగ్, ప్రవీణ్ గడిల, జగన్ నాయక్, హాజి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.
- దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.



నిజాంపేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

ప్రజలకు రక్షణ కల్పించడంలో ఎమ్మెల్యే విఫలం



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల: నియోజకవర్గ ప్రజలకు రక్షణ కల్పించడంలో ఎమ్మెల్యే వివేకానంద విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జీడిమెట్లలో గురువారం కొపల్లి ఫార్మా పరిశ్రమ ఆవరణలో రసాయనాలతో కూడిన డ్రమ్ములు పేలడం వలన మోడీ అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న శ్రీశైలంగౌడ్ శనివారం అపార్ట్‌మెంట్ వాసులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్ చేయడం తప్ప కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అధికారులతో పని చేయించడంలో ఎమ్మెల్యే విఫలం చెందారని, ఏ ఒక్క అధికారి శ్రద్ధతో పనిచేయడం లేదని ఆయన విమర్శించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అధికారులు ప్రజలకు సేవ చేశారని, ఇప్పుడు అధికారులు బీఆర్‌ఎస్ నాయకులకు తప్ప ప్రజలకు సేవ చేయడం లేదన్నారు.

పరిశ్రమల తరలింపు ఎప్పుడు..?

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమల్లో 2018లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, ప్రజలకు విఘాతం కలిగించే పరిశ్రమలను సుదూర ప్రాంతాలకు తరలిస్తానని అప్పట్లో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని శ్రీశైలంగౌడ్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు నష్టం కలిగించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కుక్కల బారినుంచి ప్రజల రక్షణకు చర్యలు

దుండిగల్: వీధి కుక్కల బారినుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం దుండిగల్‌లో బ్లూ క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో 20 కుక్కలను పట్టుకున్నారు. కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వీధి కుక్కల నివారణ చర్యల్లో భాగంగా బ్లూ క్రాస్ సొసైటీతో ఒప్పందం చేసుకున్నామని, వారు వీధి కుక్కలను తీసుకెళ్లి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్, యాంటి రేబీస్ టీకా వేసి దూర ప్రాంతాల్లో వదిలిపెడతారన్నారు. వేసవి కాలంలో కుక్కలు డీహైడ్రేషన్ కారణంగా వింతగా ప్రవర్తిస్తాయని, వాటికి కావాల్సిన తాగు నీరు, ఆహారాన్ని పిల్లలు తిరగని ప్రదేశాల్లో ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల క్రిష్ణయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.కరుణాకర్ రెడ్డి, సాత్విక్, బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

రఘునాథ్‌రావుకు డాక్టరేట్

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఇంగ్లిష్ అసోసియేట్ ప్రొఫెసర్ వై.రఘునాథ్‌రావు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సమకాలీన భారతదేశ పరిస్థితులపై అమితవ్ ఘోష్, ఉపమన్యు చటర్జీ నవలలో పొందుపర్చిన విధానంపై జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ వి.పార్వతి పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. జేఎన్‌టీయూహెచ్ 11వ వార్షికోత్సవంలో శనివారం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందరరాజన్ చేతుల మీదుగా రఘునాథ్‌రావు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఆర్‌ఐటీ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు ఆయనను అభినందించారు.



గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న రఘునాథ్‌రావు

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కాలనీలు, మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

- జీడిమెట్ల డివిజన్ గ్రీన్ పార్క్‌లో చేపడుతున్న ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధి జ్యోతి, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీదేవిరెడ్డి, స్థానిక మహిళలు విషయమై శంభీపూర్ రాజును కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.
- సూరారం, గాజులరామారం డివిజన్ల పరిధిలో నెలకొన్న సమస్యలను పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి వసతి విషయంపై ఎమ్మెల్సీకి వివరించగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజు

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ కృష్ణ

దుండిగల్: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని, త్వరగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం అభయాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఆయన వెంట జక్కుల శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై ప్రత్యేక క్యాంప్

జగద్గిరిగుట్ట: కరెంట్ బిల్లుల విషయంలో వినియోగదారుల సందేహాల నివృత్తి కోసం నేడు జగద్గిరిగుట్ట రాజీవ్ హిల్స్‌లో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈఈ రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

కూకట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వివిధ పార్కులను శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్న మాదిరిగా నగరంలో ఎక్కడా పార్కులు అభివృద్ధి చెందడం లేదని, ఇందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞత తెలిపారు. భవిష్యత్తులో కూకట్‌పల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, డివిజన్ల అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, నాయకులు సాయిబాబాచౌదరి, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, శ్యామల రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో 144 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. పేదింటి ఆడబిడ్డల ఆర్థిక సహాయం చేసి సీఎం వారికి అండగా నిలుస్తున్నారన్నారు. కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మహేశ్వరి శ్రీహరి, సబిహాబేగం, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శోభకృత్ నామ సంవత్సర కేలండర్ ఆవిష్కరణ

కూకట్‌పల్లి: శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర తెలుగు కేలండర్‌ను అహోబిల త్రిదండి రామానుజ జీయర్ స్వామి ముచ్చింతల్‌లోని జీవ ఆశ్రమంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పండుగ తెలుగు వారికి ప్రత్యేకమైన పండుగ అని, ఉగాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరూ శోభకృత్ నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగం, కో చైర్మన్ ఇందుమతి, సుమేధ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీవీఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జీడిమెట్ల: ఏఐఎమ్ఎస్ పరీక్ష లెవెల్-2లో ప్రతిభ కనబరిచిన టీవీఆర్ పాఠశాల విద్యార్థులను డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి అభినందించారు. 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు చూపిన ప్రతిభలో ఉపాధ్యాయుల కృషి ఉందని ఆయన అన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ రవిసూరను వంశీకృష్ణారెడ్డి అభినందించారు.